క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ విప్ సామినేని ఉదయభాను కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో మాజీ విప్ ఉదయభాను ఆయన్ను కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, ఆ తరువాత జరిగిన పరిణామాలు, జగ్గయ్యపేట నియోజకవర్గంలో పార్టీ విషయాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితులు సహజమేనని, పేదలకు న్యాయం జరిగేలా వారి పక్షాన పోరాడుదామని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఆయన వివరించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వారిలో జగ్గయ్యపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కూడా ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



కొణకంచి(పెనుగంచిప్రోలు): ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు మన్నేపల్లి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి సుధానంద్ కోరారు. మండలంలోని పాఠశాలల్లో గురువారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవోనంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు అందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి జిలానీ, ఎస్.సుబ్రమణ్యస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

కునికెనపాడు(కంచికచర్ల) : మండలంలోని కునికెనపాడు ఎంపీపీ స్కూల్ వంట ఏజెన్సీ నిర్వాహకురాలిగా 20ఏళ్లుగా పనిచేస్తున్న ముదిగొండ రేణుక(58) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. రేణుక మృతదేహాన్ని సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, ఎంఈఓ బి.బాలాజీ, పాఠశాల హెచ్ఎం నండ్రు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

17న స్వామివార్ల ధోవతి, చీరల వేలం

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారికి భక్తులు సమర్పించిన ధోవతి, చీరలను ఈనెల 17వతేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో హేమలతాదేవి గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం తొమ్మిది నుంచి దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో నిర్వహించే వేలంలో ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఇటీవల డయేరియా వ్యాధి విజృంభించడంతో మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయాల నుంచి ఆశావర్కర్లు, హెల్త్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. తాగునీరు, సీజనల్‌వ్యాధులు, డయేరియా, పారిశుద్ధ్య పరిస్థితిపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ పాకెట్లు, క్లోరిన్ టాబ్లెట్లను పంపిణీ చేసి, వాటిని వినియోగించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. భక్తులు నాగమానసాదేవి అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు సమర్పించిన గాజులతో అమ్మవారిని అలంకరించారు.

తల్లుల ఎదురుచూపులు

- ఇంకా అందని 'తల్లికి వందనం' డబ్బులు
- ఎంతమంది పిల్లలున్నా..ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇస్తామని ఎన్నికల హామీ
- కుటుంబంలో ఒకరికే ఇస్తారన్న ప్రచారంపై సర్వత్రా ఆందోళన
- ఫీజుల కోసం ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఒత్తిడి
- గతేడాది జూన్‌లోనే అందిన 'అమ్మఒడి'
- 'తల్లికి వందనం' అందితే భారం తగ్గుతుందంటున్న తల్లిదండ్రులు



కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు అందజేస్తామంటూ పేర్కొన్న హామీ(సర్కిల్‌లో)

కంచికచర్ల/జగ్గయ్యపేట: 'తల్లికి వందనం' పథకం అమలు కోసం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే 'తల్లికి వందనం' పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామంటూ టీడీపీ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటై నెలరోజులు గడుస్తున్నా 'తల్లివందనం' పథకం మాత్రం ఇంకా అమలుకాలేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పట్లో జూన్‌లోనే 'అమ్మ ఒడి' పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమచేయగా, టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలదాటిన నేపథ్యంలో 'తల్లికి వందనం' నగదు కోసం నందిగామ నియోజకవర్గంలోని 37,244మంది విద్యార్థుల తల్లులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆర్థికభారం తగ్గుతుందని...

పాఠశాలలు, కళాశాలలు తెరిచి అప్పుడే రెండో నెల కూడా అయ్యింది. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులు తమకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రిని అతికష్టం మీద కొనుగోలు చేసుకుంటున్నారు. మరో వైపు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల ఫీజులు చెల్లించాలని, పుస్తకాలు తీసుకోవాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయి.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తానన్న తల్లికి వందనం పథకం డబ్బులు ఎప్పుడిస్తారోనన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ఓవైపు ప్రైవేటు పాఠశాలల ఫీజుల మోత, మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా 'తల్లికి వందనం' ఆర్థిక సాయం కోసం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని సుమారు 25వేల మంది విద్యార్థుల కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

ఒక్కరికే ఇస్తారనే ప్రచారంతో ఆందోళన..

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అమ్మఒడి పథకం పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ఓ కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలు ఎంతమంది ఉన్నా అందరికీ..ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు టీడీపీ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఆర్థిక సాయం అందించేలా జీవో ఇచ్చిందన్న ప్రచారం జరుగుతుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఈ పథకం అమలుకు అనేక ఆంక్షలను సైతం పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడంతోపాటు కాలయాపన చేసేందుకు కూడా కుట్ర పన్నినట్లు ప్రచారం జరుగుతుండడంతో ఈ పథకం అమలుపై పిల్లల తల్లులలో అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలను త్వరితగతిన ఇవ్వడంతోపాటు ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.30వేలు ఇస్తారని ఆశ..



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్న పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నందున రూ.30వేలు వస్తాయని ఎదురుచూస్తున్నాం.

– కంబాల మాధవి, బలుసుపాడు, జగ్గయ్యపేట మండలం.

ఆర్థిక భారం తగ్గుతుందని..



అమ్మ ఒడి కింద నాలుగేళ్లుగా ఏటా రూ.15వేలు అందుతుండటంతో మా ఇద్దరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలోని చేర్పించాం. ఈసారి తల్లికి వందనం పథకం కింద ఇద్దరికి కలిపి రూ.30వేలు అందితే ఆర్థికంగా భారం తగ్గుతుందని భావిస్తున్నాం.

– గోగుల కాంతకుమారి, ఇందిరాకాలనీ, జగ్గయ్యపేట

ఇంకా పుస్తకాలు కొనలేదు..



మాకు ఇద్దరు పిల్లలు. వారిని ప్రైవేట్ పాఠశాలలో చేర్చా. ఇంకా పుస్తకాలు కొనలేదు. తల్లికి వందనం పథకం కింద నగదు అందుతుందని ఎదురుచూస్తున్నా. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు చదువుకుంటే అంతమందికి ఇస్తామని గత ఎన్నికల్లో చెప్పారు. తల్లికి వందనం పథకాన్ని త్వరితగతిన అందించాలని కోరుతున్నాం.

– కృష్ణజ్యోతి, గండేపల్లి, కంచికచర్ల మండలం

ఫీజు కోసం ఒత్తిడి చేస్తున్నారు



మాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ పాఠశాలలో 8, 10వ తరగతులు చదువుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమై రెండోనెల కావస్తుండటంతో ఫీజుల కోసం పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తున్నారు. తల్లికి వందనం పథకం కింద మా ఇద్దరు పిల్లలకు కలిపి రూ.30వేలు వస్తాయి. ఆ డబ్బులు అందితే మేము ఫీజు కట్టడానికి వెసులుబాటుగా ఉంటుంది.

ఈవూరి రజని, పోచంపల్లి, జగ్గయ్యపేట మండలం

తల్లికి వందనం అందింతే ఉపయుక్తం



మా ఇద్దరు పిల్లలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6,10 తరగతులు చదువుతున్నారు. ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పినట్లుగానే పథకాన్ని అందిస్తే మాలాంటి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–ఉప్పుతోళ్ల నర్సులు, పోచంపల్లి

ఎదురు చూస్తున్నాం..



పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించి నెల రోజులు దాటింది. మా పాప ఇంటర్, బాబు ఎనిమిదోతరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం కింద ఇద్దరికి డబ్బులు వస్తాయని ఎదురు చూస్తున్నాం. కళాశాల ఫీజులు, పిల్లలకు సంబంధించి ఇతర ఖర్చులకు ఈ డబ్బులు ఉపయోగపడతాయి.

– గొర్రెపాటి సుధారాణి, కె.పొన్నవరం, పెనుగంచిప్రోలు మండలం

తక్షణం ఫీజులు కట్టాలని అంటున్నారు



మాకు ఇద్దరు పిల్లలు, నందిగామలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలలో ఫీజులు కట్టాలని అడుగుతున్నారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్ మొదలైన వాటికి ఖర్చు చేశాం. తల్లికి వందనం పథకం కింద ఆర్థికసాయం అందితే మాలాంటి వారికి ఊరటగా ఉంటుంది.

– కీసర లక్ష్మి, శనగపాడు, పెనుగంచిప్రోలు మండలం

తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్నా



నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలు బడికి వెళితే అంత మందికి ఒకొక్కరికి రూ. 15 వేలు చొప్పున అందిస్తామన్నారు. గడిచిన ఎన్నికలలో కూటమి ప్రభుత్వం వచ్చింది. తల్లికి వందనం డబ్బులు కోసం ఎదురు చూస్తున్నాం. తక్షణమే ప్రభుత్వం స్పందించి నగదు జమ చేయాలి.

– షోడగిరి రాజశ్రీ, పొన్నవరం

మాలాంటి పేదలకు మేలు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. మాది రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. తల్లికి వందనం పథకం కింద ఇద్దరికి డబ్బులు అందిస్తే మాలాంటి పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది. ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నాం.

– కురగంటి ప్రత్యూష, తాటిగుమ్మి

ఫీజులు కట్టుకుంటాం...



ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన తల్లికి వందనం పథకం కోసం ఎదురు చూస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలకు కలిపి ఈపథకం కింద రూ.30 వేలు వస్తాయని ఎదురుచూస్తున్నాం. ఫీజులు కోసం పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. తల్లికి వందనం అందిస్తే ఆసరాగా ఉంటుంది.

– ఎం.రోజా, మక్కపేట, వత్సవాయి మండలం

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్

నందిగామ(కంచికచర్ల) : ద్విచక్రవాహనాలను నడిపే సమయంలో వాహనచోదకులంతా తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్ సూచించారు. నందిగామ కమ్మ కళ్యాణ మండపంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబూ విద్యాసాగర్ అధ్యక్షతన గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సందర్భంగా జడ్జి రియాజ్ మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు అన్ని గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనచోదకులు ఏదైనా ప్రమాదానికి గురైతే అతని కుటుంబమంతా ఇబ్బందుల్లో పడుతున్నందున, అందరూ హెల్మెట్‌ను వినియోగిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో సీ బుక్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరిమిత వేగానికి లోబడే వాహనాలను నడపాలని సూచించారు. అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎక్కిరాల హనుమంతరావు, కోశాధికారి రవికుమార్, న్యాయవాది మాశేశ్వరరావు, సీఐ హనీష్, ఎస్ఐ పండుదొర, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారులు, సిబ్బందికి సత్కారం



సన్మానగ్రహీతలతో డీఎల్‌పీవో శివమూర్తి , ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

కంచికచర్ల : గ్రామ పంచాయతీల అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగునకు ప్రతి ఒక్కరూ ఇంటిపన్ను, నీటి పన్నులు చెల్లించాలని ఎప్పటికప్పుడు సజావుగా చెల్లించాలని డీఎల్‌పీవో భమిడి శివమూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూరుశాతం పన్నులు వసూలు చేసిన పంచాయతీ అధికారులు, సిబ్బంది, గుమస్తాలను గురువారం ఘనంగా సత్కరించారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకు గల ఆయా పంచాయతీల కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, ఉద్యోగులు వి.బ్రహ్మం, వెల్లంకి రామారావు, షేక్ నాగుల్‌మీరా, మహ్మద్‌మీర్జావలి, కనగాల రవికుమార్, వనిత, రత్నాకర్, నాగలక్ష్మి, అభినవ్, హరికృష్ణ, మౌనిక, రాజ్యలక్ష్మి, గుప్తా, తిరుపతిరావులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీ కంచికచర్లలో 84శాతం పన్నులు వసూలు అయ్యాయని మండలంలో మిగిలిన 15 గ్రామ పంచాయతీల్లో నూరుశాతం పన్నులు వసూలైనట్లు వివరించారు. ఇంటిపన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. నూరుశాతం పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బాలశంకరరావు, ఎంఈవో బి.బాలాజీలను శాలువాలతో సత్కరించారు.

అమ్మవారికి బోనాలు



అమ్మవారికి బోనాలు తెచ్చిన తెలంగాణ భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న విజయవాడకు చెందిన భక్తులు

పెనుగంచిప్రోలు: ఆషాడమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని గురువారం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. విజయవాడకు చెందిన భక్తులు అమ్మవారి వేషధారణలో వచ్చి బోనాలు సమర్పించారు. అమ్మవారిని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావుతో పాటు పాలకవర్గ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

17న దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో తొలి ఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 17వ తేదీ బుధవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, శ్రీదేవి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి 11సార్లు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తామని వివరించారు.

సబ్‌ప్లాన్ ప్రకారం నిధులను కేటాయించాలి

జగ్గయ్యపేట అర్బన్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎస్సీల అభివృద్ధికి కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాలను అందించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు డిమాండ్ చేశారు. కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జగ్గయ్యపేట మండల కమిటీ సమావేశం గురువారం స్థానిక డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో సమితి జిల్లా నాయకుడు జె.వెంకట్రావ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను చర్చించారు. కేవీపీఎస్‌తో సంబంధాలున్న గ్రామాల్లో గ్రామ కమిటీలు వేయాలని, గ్రామాల వారీగా వచ్చిన గ్రామాల కార్యకర్తలు తేదీలను ప్రకటించారు. జిల్లా కార్యదర్శి నటరాజు మాట్లాడుతూ నూతన విద్యావిధానం కారణంగా గ్రామాల్లో మూసివేసిన స్కూళ్లు తెరిపించి ఎస్సీ, ఎస్టీలు బడిబాట పట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేవీపీఎస్ పేట మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మీనారాయణ, ఆదిమళ్ల అబ్రహాం, అంబోజి విద్యాసాగర్, కె.దేవయ్య, ఎం.తిమోతి, కరిసె మధు, హుస్సేన్, పుల్లయ్య పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరు అందిస్తాం



చెవిటికల్లు పంపింగ్ స్కీమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సౌమ్య



తుర్లపాడులో వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల : ఆయకట్టు చివరి భూములకు కూడా పుష్కలంగా సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని చెవటికల్లు, గనిఆత్కూరు పంపింగ్ స్కీమ్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నివేళలా రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమమంలో సర్పంచి షేక్ ఇబ్రహీం, ఎంపీటీసీ సభ్యులు కోగంటి బాబు, వెంపరాల వెంకటేశ్వరరావు, నాయకులు కోగంటి విష్ణు, అచ్చయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తుర్లపాడులో ట్యాంకర్ ప్రారంభం

చందర్లపాడు(కంచికచర్ల) : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి ఎద్దడి లేకుండా అవసరమైతే ట్రాక్టర్ల సాయంతో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి



ప్రాజెక్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ చెప్పారు. ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్స్ విద్యార్థులకు ఐఓటీ అంశంలో ప్రాజెక్టులపై మూడు వారాల పాటు జరిగే వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌ను ప్రారంభించిన చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అనేక గొప్ప ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో చాలా వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుంటుందన్నారు. ఆ రంగంలో విద్యార్థులు మరింత పట్టు సాధించాలని చెప్పారు. ఆ దిశగా ఈ వర్క్‌షాప్ తోడ్పడుతుందన్నారు. ఎడ్యునో రోబోట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోశాధికారి రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతులు మహాలక్ష్మి, పి.శిల్ప, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అక్బర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ పీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ సభ్యుల సమక్షంలో యూనియన్ జెండాను విశ్రాంత డిపో కార్యదర్శులు ఎస్ఎస్.రావు, బి.కోటయ్య, ఎస్‌చలపతిరావు, షేక్ మీరా ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు షేక్ ఇమాం, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు సాంబశివరావు, జిలాని, గ్యారేజీ కార్యదర్శి ఎ.శివగోపి తదితరులు పాల్గొన్నారు.